క్లుప్తంగా

కిడ్నీ వ్యాధి బాధితురాలికి సాయం



సత్యనారాయణకు సాయం అందజేస్తున్న కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు

రావులపాలెం: కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మహిళకు వైద్య చికిత్స నిమిత్తం స్థానిక శ్రీకాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు శుక్రవారం రూ.15 వేల సాయం అందజేశారు. మండలంలోని రావులపాడుకి చెందిన గేదెల లక్ష్మీదుర్గ (52) మహిళ కిడ్నీ సంబంధిత వ్యాధితో తీవ్ర అనారోగ్యంతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుంది. వారి ఆర్థిక పరిస్థితి సరిగా లేనందున వైద్యం చేయించుకోలేని పరిస్థితుల్లో ఆమె కుమారుడు స్థానిక కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులను సాయం కోరారు. దీంతో ఆమె భర్త సత్యనారాయణకు కాశీ అన్నపూర్ణాదేవి సేవా సమితి సభ్యులు రూ.15 వేల నగదును అందజేశారు.

విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలి

మామిడికుదురు: విద్యతో పాటు అన్ని రంగాల్లోను విద్యార్థులు రాణించాలని సర్పంచ్ తెలగారెడ్డి సూర్యప్రకాశరావు పేర్కొన్నారు. పాశర్లపూడిలంక జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థుల అభినందన సభ శుక్రవారం హెచ్ఎం ఎన్‌వీఎస్ఎస్ దుర్గాప్రసాద్ అధ్యక్షతన జరిగింది. డ్రాయింగ్, క్రాఫ్ట్ పోటీలతో పాటు క్రీడల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ.10 వేల నగదు ప్రోత్సాహాలను బహుమతులుగా అందించారు. కార్యక్రమంలో కవి పాలమూరి విక్రమ్, పీఎంసీ చైర్మన్ భూపతి రమేష్, ఉప సర్పంచ్ విప్పర్తి వెంకటరమణ, పితాని వెంకటేశ్వరరావు, రొక్కాల వెంకట్రావు, తెలగారెడ్డి రాధాకృష్ణ, కంచర్ల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ వర్ధంతి నిర్వహించాలి

అంబాజీపేట: దివంగత మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని అన్ని గ్రామాల్లో శనివారం ఘనంగా నిర్వహించాలని పార్టీ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వాసంశెట్టి చినబాబు, నాగవరపు నాగరాజు పిలుపునిచ్చారు. స్థానిక బస్టాండ్ వద్ద వైఎస్ విగ్రహానికి నివాళులర్పించి వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నామన్నారు.

ఆకట్టుకున్న జీ-20 దేశాల సమావేశం

అంబాజీపేట: స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో హెచ్ఎం కె.సాయిరామ్ ఆధ్వర్యంలో జీ.20 దేశాల సమావేశ (మాక్) నమూనాను విద్యార్థులతో శుక్రవారం నిర్వహించారు. ఈ నెల 9, 10వ తేదీల్లో ఢిల్లీల్లో శిఖరాగ్ర సమావేశం జరగనున్న సందర్భంగా విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు ఈ సమావేశాన్ని ఏర్పాటు చేశామన్నారు. అమెరికా, ఇంగ్లాడ్, టర్కీ, జపాన్, ఇండోనేషియా, బ్రెజిల్, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, కెనడా, చైనా, యూరోపియన్ యూనియన్, ఫ్రాన్స్, జర్మనీ, ఇండియా, ఇండోనేషియా, ఇటలీ, జపాన్, మెక్సికో దక్షిణాఫ్రికా, సౌదీ అరేబియా దేశ ప్రతినిధులుగా 20 మంది విద్యార్థులకు తర్ఫీదునిచ్చామన్నారు. హెచ్ఎం సాయిరాం యూఎన్ఓ సెక్రటరీగా మాట్లాడుతూ ప్రపంచ దేశాలు ఎదుర్కొంటున్న పర్యావరణ సవాళ్లను అధిగమించి, సుస్థిర అభివృద్ధి సాధించాలని జీ-20 దేశాలను కోరారు. వివిధ దేశాల పాత్రలో విద్యార్థులు పలువురిని అలరించారు. కార్యక్రమంలో మహ్మద్ ఉన్నీసా బేగం, ఎల్.వెంకటేశ్వరరావు, ఎ.ఆనందకుమార్‌లు పాల్గొన్నారు.

వ్యవసాయ మండలి చైర్మన్‌గా 'మేడిచర్ల'

మలికిపురం: మండలంలోని రామరాజులంక గ్రామ వ్యవసాయ సలహా మండలి సమావేశం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం జరిగినది. సార్వా సాగులో వివిధ రైతులకు కావలసిన ఎరువులు, విత్తనాలు మొదలైన అంశాలపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో గ్రామ వ్యవసాయ సలహా మండలి చైర్మన్‌గా మేడిచర్ల శ్రీనివాసరావుని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమానికి పీఏసీఎస్ చైర్మన్ చొప్పల రాజేశ్వరరావు అధ్యక్షత వహించగా ఎంపీటీసీ మేడిచర్ల వెంకటరాజు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ నల్లి శివకుమార్, గ్రామ పార్టీ అధ్యక్షుడు రావి గోపాలకృష్ణ, చెల్లుబోయిన సత్యనారాయణ, మేడిచర్ల నాగేశ్వరరావు రైతులు గ్రామ అగ్రికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. సమావేశం అనంతరం నూతన చైర్మన్‌ను రైతులు అభినందించారు.

అప్పనపల్లిలో సేవా కార్యక్రమాలు

మామిడికుదురు: జనసేన అధినేత పవన్ కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా అప్పనపల్లిలో ఏర్పాటు చేసిన పార్టీ స్థూపాన్ని, ఉచిత వైద్య, రక్తదాన శిబిరాలను ఆ పార్టీ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షుడు కందుల దుర్గేష్ శుక్రవారం ప్రారంభించారు. అనంతరం పార్టీ మండల శాఖ అధ్యక్షుడు జాలెం శ్రీనివాసరాజా అధ్యక్షతన జరిగిన సభలో పేదలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. పెదపట్నంలంకలో ఏర్పాటు చేసిన స్థూపాన్ని కూడా దుర్గేష్ ప్రారంభించారు.

ఆనందమనిపింఛన్

- నూతన పింఛన్ల అందజేత
- పాల్గొన్న ఎమ్మెల్యే జగ్గిరెడ్డి



గోపాలపురంలో నూతనంగా మంజూరైన పింఛన్లను అందజేస్తున్న ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి

రావులపాలెం: గత ప్రభుత్వం మాదిరిగా అధికార పార్టీ కండువా కప్పుకుంటేనే పింఛన్ అనే విధంగా కాకుండా అర్హత ఉన్న అందరికీ పార్టీలకు అతీతంగా సామాజిక పింఛన్లు అందిస్తున్నామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి అన్నారు. రావులపాలెం మండలం గోపాలపురంలో శుక్రవారం ఎమ్మెల్యే స్వగృహం వద్ద జరిగిన కార్యక్రమంలో నూతనంగా మంజూరైన పింఛన్లను జగ్గిరెడ్డి లబ్ధిదారులకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు రూ.10 కోట్ల పైనే ప్రతి నెలా పెన్షన్ల రూపంలో లబ్ధిదారులకు అందజేస్తున్నామన్నారు. కొత్తగా ఆత్రేయపురం మండలానికి 464, ఆలమూరు మండలానికి 581, రావులపాలెం మండలానికి 536, కొత్తపేట మండలానికి 561 పింఛన్లు కలిపి మొత్తంగా 2,142 మందికి పింఛన్లు నూతనంగా మంజూరైనట్టు తెలిపారు. గతంలో వృద్ధాప్య పింఛన్ వయసు 65 సంవత్సరాలు ఉండగా సీఎంగా జగన్ ప్రమాణస్వీకారం చేసిన వెంటనే 65 నుంచి 60 సంవత్సరాలకు తగ్గించారన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సబ్బితి మోహనరావు, మాజీ ఉప సర్పంచ్ చిర్ల రామచంద్రారెడ్డి, కార్యదర్శి అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేటలో..

అంబాజీపేట: స్థానిక ఎంపీపీ కార్యాలయంలో నూతనంగా మంజూరైన 204 ఫించన్‌లను లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ సాంకేతిక కారణాల వల్ల నిలిచిపోయిన, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫించన్లు వస్తాయని ఎవ్వరూ అధైర్య పడవద్దన్నారు. మండల వ్యాప్తంగా పలు గ్రామాల్లో నూతన పింఛన్లు మంజూరయ్యాయన్నారు. మరికొన్ని మండల ప్రజా పరిషత్ అధికారి పరిశీలనలో ఉన్నాయని అర్హులైతే వారికి ఫించను వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మట్టా పార్వతి, జేసీఎస్ మండల కన్వీనర్ దొమ్మేటి సత్యమోహన్, ఏఎంసీ వైస్ చైర్మన్ నాగవరపు నాగరాజు, మైలా ఆనందరావు, పితాని వీరాస్వామి, కుసుమ శ్రీను, ఉందుర్తి నాగబాబు, మట్టా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం రీ వెరిఫికేషన్ పింఛన్లు, కొత్త పింఛన్లు కలిపి మండల వ్యాప్తంగా 237 పింఛన్లను ఎంపీపీ వీరా మల్లిబాబు పంపిణీ చేశారు. ఎంపీడీవో జి.భీమారావు అధ్యక్షతన జరిగిన పై కార్యక్రమంలో ఆయన లబ్ధిదారులకు పింఛన్‌లు అందజేశారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అర్హత ఉన్న ఏ ఒక్కరికీ కూడా పింఛన్ ఆగదన్నారు. వైస్ ఎంపీపీ రుద్రరాజు చిన రాజా, సఖినేటిపల్లి సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు, పార్టీ మండల అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్, ఉపాధ్యక్షురాలు పెదపాటి నాగలక్ష్మి, నాయకులు ఈద రవిరెడ్డి, నల్లి సురేంద్రరావు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కొత్తపేటలో..

కొత్తపేట: ప్రజా సంక్షేమ పథకాలు అమలులో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని ఎంపీపీ మార్గన గంగాధరరావు అన్నారు. కొత్తపేట మండలంలో నూతనంగా 561 మందికి నూతన పింఛన్లు మంజూరయ్యాయి. మోడేకుర్రులో 27 మందికి మంజూరు కాగా శుక్రవారం సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ గంగాధరరావు ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన పింఛన్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షుడు మామిడిశెట్టి ఏడుకొండలు, పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ గోగి సురేష్, పార్టీ బీసీ, ఎస్సీ విభాగాల సభ్యులు కుడుపూడి వెంకటేశ్వరరావు, మాగాపు చక్రవర్తి, చింతపల్లి సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి శాంతి తదితరులు పాల్గొన్నారు.



అంబాజీపేటలో లబ్ధిదారులకు నూతన ఫించన్ అందిస్తున్న ఎంపీపీ వెంకటేశ్వరరావు



సఖినేటిపల్లి ఎంపీపీ కార్యాలయంలో కొత్త పింఛన్ ఇస్తున్న ఎంపీపీ మల్లిబాబు



మోడేకుర్రులో కొత్త పింఛన్ అందజేస్తున్న ఎంపీపీ గంగాధరరావు

కలెక్టర్ ఆదేశాలతో ఆక్రమణల తొలగింపు



గాజులగుంట కాలువపై జేసీబీతో ఆక్రమణలు తొలగిస్తున్న ఏఈ సుందర్‌సింగ్

పి.గన్నవరం: గాజులగుంట కాలువ శివారు ప్రాంత భూములకు సాగు నీరు అందడం లేదని రైతులు ఆందోళన చేపట్టిన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆదేశాలతో ఆక్రమణలు, పూడిక తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు. తమ భూములకు సాగు నీరు అందడం లేదని గాజులగుంట, ముంగండపాలెం రైతులు ఇటీవల ఆందోళన నిర్వహించిన విషయం విదితమే. ఈ కాలువపై 320 ఎకరాల భూమి సాగవుతోంది. రైతుల ఆందోళన విషయాన్ని ఇరిగేషన్ ఏఈ డి.సుందర్ సింగ్ కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో కాలువలో పూడిక తొలగింపునకు కలెక్టర్ రూ.2.7 లక్షలు మంజూరు చేశారు. దీంతో కాలువలో పూడిక తొలగింపు పనులు నిర్వహిస్తున్నారు. కాలువ మెయిన్ రోడ్డు పక్కన ప్రవహిస్తోంది. పలు షాపుల వద్ద కాలువపై బల్లలు, పక్కా శ్లాబులు నిర్మించారు. కాలువలో పూడికతో పాటు, బల్లలను తొలగించారు. పక్కాగా శ్లాబులు వేసిన ప్రాంతాల్లో ఆరు అడుగులకు ఒక మేన్‌హోల్ ఏర్పాటు చేసి, పూడిక తీస్తున్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ సిబ్బంది, సంబంధిత రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోలుకోవాలంటూ పూజలు



అప్పనపల్లి బాలాజీ ఆలయంలో మృత్యుంజయ హోమం నిర్వహణ

అంబాజీపేట: అస్వస్థతకు గురై హైదరాబాద్ కిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు త్వరగా కోలుకోవాలంటూ పార్టీ మండల శాఖ ప్రధాన కార్యదర్శి నాగవరపు నాగరాజు ఆధ్వర్యంలో అంబాజీపేట మసీదులో శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే చిట్టిబాబు సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని ఎల్లవేళలా దేవుని ఆశీస్సులు ఆయనపై ఉండాలంటూ ముస్లింలు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఉందుర్తి నాగబాబు, కుసుమ శ్రీను, పితాని వీరాస్వామి, మట్టపర్తి యజ్ఞశ్రీ, నేదునూరి ఏసు, మట్టపర్తి వెంకటేశ్వరరావు, నాగాబత్తుల శశి తదితరులు పాల్గొన్నారు.

అప్పనపల్లిలో..

మామిడికుదురు: అనారోగ్యంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పి.గన్నవరం ఎమ్మెల్యే కొండేటి చిట్టిబాబు పేరిట శుక్రవారం అప్పనపల్లి బాలబాలాజీ స్వామి ఆలయంలో మృత్యుంజయ హోమం నిర్వహించారు. ఎమ్మెల్యే ఆరోగ్యం మెరుగుపడాలని, ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తూ ఈ హోమం నిర్వహించారు. వేద పండితులు జ్యోతుల్లు సోమయాజులు వేద మంత్రాలతో ఈ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరిపించారు. అనంతరం ఎమ్మెల్యే చిట్టిబాబు పేరిట స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించారు. గ్రామ సర్పంచ్ గెద్దం మంగాలక్ష్మి, పార్టీ సీనియర్ నేత గెద్దం వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ హోమం జరిగింది. ఈ పూజా కార్యక్రమాల్లో ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, మాజీ చైర్మన్ పిచ్చుక చిన్న, మండల ఎంపీటీసీల సమాఖ్య అధ్యక్షుడు నెల్లి దుర్గాప్రసాద్, మండల జేసీఎస్ కన్వీనర్ జక్కంపూడి వాసు, గ్రామశాఖ అధ్యక్షులు బత్తుల జనార్దన్, చిక్కం బుజ్జిబాబు, పార్టీ నేతలు తులా గోపాలకృష్ణ, పాలమూరి గోపాల్, తులా నాగరాజు, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, నీతిపూడి మహేష్, కంకిపాటి హిమవంతరావు, చొల్లంగి వీరవెంకటసత్యనారాయణ తదితరులు ఉన్నారు.

పి.గన్నవరంలో..

పి.గన్నవరం: హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎమ్మెల్యే చిట్టిబాబు త్వరగా కోలుకుని, సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని పెదకందాలపాలెం న్యూ జెరేషలేం చర్చిలో వైఎస్సార్ సీపీ నాయకులు శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెవరెండ్ జి.దానియేలు ఆధ్వర్యంలో ఈ ప్రార్థనలు జరిగాయి. మండల శాఖ అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర రావు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ మద్దుల వరలక్ష్మి, సర్పంచ్‌లు సమాఖ్య అధ్యక్షుడు తోలేటి బంగారునాయుడు, కొంబత్తుల ఏసు, రామారావు, రాష్ట్ర నాయకులు దొమ్మేటి వెంకటశివరామన్, పితాని నర్సింహరావు, నాయకులు మంగం చిట్టిబాబు, కారుపల్లి శ్రీను, బొక్కా ఏడుకొండలు, చికిలే ప్రసాద్, జల్లి శ్రీను, కొల్లే సూర్యనారాయణ, గుత్తుల మధు, నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో వరలక్ష్మీ వ్రతాలు



అంతర్వేది రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో వరలక్ష్మీ కుంకుమ పూజలు చేస్తున్న భక్తులు

అంబాజీపేట: మహిళలు తమకు కోరిన వరాలు సిద్ధించేలా చేసుకొనే పండగల్లో వరలక్ష్మీ వ్రతాన్ని మూడో శుక్రవారం మహిళలు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. అంబాజీపేట, పుల్లేటికుర్రు, గంగలకుర్రు, గంగలకుర్రు అగ్రహారం, వ్యాఘ్రేశ్వరం, ముక్కామల తదితర గ్రామాల్లోని కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో రాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి ఉపాలయం వద్ద మూడో శుక్రవారం ఆలయ ఏసీ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ కుంకుమ పూజలు మహిళలు నిర్వహించారు. తొలుత అమ్మవారి ఉపాలయం వద్ద ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామరంగాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం సుమారు 400 మంది మహిళా భక్తులు అర్చకుల పర్యవేక్షణలో పూజల్లో పాల్గొన్నారు. ఎటువంటి పూజా రుసుం లేకుండా అమ్మవారి రూపు, పూజా సామగ్రి, ప్రసాదం దేవస్థానం వద్ద దాతల సహకారంతో ఉచితంగా ఆలయ సిబ్బంది అందజేశారు. పూజల అనంతరం స్వామివారి దర్శనం, నిత్యాన్నదానంలో భోజన వసతి దేవస్థానం ఏర్పాటు చేసింది.

బీఎల్ఓలతో సమీక్ష

పి.గన్నవరం: ఓటర్ల జాబితాల ఇంటింటి వెరిఫికేషన్‌లో వివిధ కారణాలతో తొలగించిన ఓట్లకు సంబంధించి సరైన కారణాలను ఆధారాలను సేకరించి, రికార్డులను సిద్ధంగా ఉంచాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ ఎ.రమణారెడ్డి బూత్ లెవెల్ అధికారులకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నియోజకవర్గంలోని బూత్ లెవెల్ అధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. మరణించిన ఓటర్లతో పాటు వివిధ కారణాలతో నియోజకవర్గంలో మొత్తం 3092 ఓట్లు తొలగించినట్టు ఆయన వివరించారు. ఏ కారణాలతో ఓట్లను తొలగించారో ఆధారాలు పక్కాగా ఉండాలని, దీనికి బీఎల్ఓలదే బాధ్యత అని అన్నారు. సమావేశానికి గైర్హాజరయిన బీఎల్ఓలకు మెమోలు జారీ చేయాలని ఆదేశించారు. డ్వామా పీడీ మధుసూదనరావు, తహసీల్దార్‌లు జి.రవీంద్రనాథ్ ఠాగూర్, పి.మంగతాయారు, నాగలక్ష్మమ్మ, రియాజ్ హుస్సేన్ పాల్గొన్నారు.

తూర్పుపాలెంలో నా మట్టి.. నా దేశం



తూర్పుపాలెంలో మొక్క నాటుతున్న బీజేపీ నాయకులు

మలికిపురం: బీజేపీ ఆధ్వర్యంలో నా మట్టి.. నా దేశం కార్యక్రమం శుక్రవారం మండలంలోని తూర్పుపాలెంలో పార్టీ శ్రేణులు నిర్వహించారు. మట్టిని సేకరించి మొక్కలు నాటారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి అడబాల సత్యనారాయణ, రాష్ట్ర బీజేపీ కో-ఆపరేటివ్ సెల్ డైరెక్టర్, మండల పార్టీ ఇంచార్జ్ మాలే శ్రీనివాస నగేష్ మాట్లాడుతూ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా ఈనెల ఒకటి నుంచి అక్టోబర్ 31 వరకు ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటి నుంచి మట్టిని సేకరించి, మొక్కలు నాటి దేశ రాజధాని ఢిల్లీలో పవిత్ర అమృత వాటిక నిర్మాణంలో మట్టిని భాగస్వామ్యం చేస్తారని చెప్పారు. గ్రామస్థాయిలో సేకరించిన మట్టిని కలశంలో పొందుపరిచి మండల స్థాయిలో, జిల్లాస్థాయిలో, రాష్ట్రస్థాయిలో సేకరించిన మట్టిని ఢిల్లీకి పంపిస్తారని వారన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, మండల కిసాన్ మోర్చా అధ్యక్షులు శంకర రఘునాథబాబు పాల్గొన్నారు.

మోడేకుర్రులో కంటి వెలుగు పరీక్షలు



మోడేకుర్రులో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న పీఏఓ కోటేశ్వరరావు

కొత్తపేట: ప్రతి ఒక్కరి సంపూర్ణ ఆరోగ్యమే లక్ష్యంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వైద్య రంగానికి అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందని మోడేకుర్రు సర్పంచ్ కుడుపూడి రామలక్ష్మి అన్నారు. మండలంలోని మోడేకుర్రులో శుక్రవారం వైఎస్సార్ కంటి వెలుగు పరీక్షా శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని సర్పంచ్ సందర్శించారు. ఆమె మాట్లాడుతూ ప్రజారోగ్యంలో భాగంగా వైఎస్సార్ కంటి వెలుగు పథకం కింద గ్రామ గ్రామానా నిర్వహిస్తున్న కంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో పారామెడికల్ ఆప్తాల్మిక్ ఆఫీసర్ ధర్మవరపు కోటేశ్వరరావు కంటి పరీక్షలు నిర్వహించారు. 50 మందికి పరీక్షలు నిర్వహించారు. వారిలో 30 మందికి కళ్లజోళ్లు వేయడానికి, నలుగురికి కాటరాక్ట్ ఆపరేషన్‌కు గుర్తించారు. ఏఎన్ఎంలు, కంటి వెలుగు విభాగం సిబ్బంది, ఆశ వర్కర్స్, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తింపు కార్డులు మంజూరు చేయాలి

రాజోలు: కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేస్తుందని ఏఐటీయూసీ నాయకుడు దేవ రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం వేగివారిపాలెంలో జిల్లా కార్మికశక్తి పెయింటర్స్ యూనియన్ సమావేశం జరిగింది. కార్మిక హక్కులకు, రక్షణకు భంగం కలిగించే చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేబర్ కమిషన్ కార్మికులకు తక్షణమే గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. యూనియన్ అధ్యక్షుడు మందపాటి మధురాజు, మంగం వినోద్ పాల్గొన్నారు.

విజయదుర్గ అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ

కొత్తపేట: స్థానిక బోడిపాలెం సెంటర్‌లో విజయదుర్గా అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ, జీవ ధ్వజస్తంభ, లక్ష్మీదేవి శిలా విగ్రహ ప్రతిష్ఠ, బలిపీఠం, సింహవాహన సంపూర్ణ ప్రతిష్ఠ మహోత్సవానికి సంబంధించి వివిధ పూజలు, హోమాలు వైభవంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల పాటు వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. దానిలో భాగంగా రెండోరోజు శుక్రవారం ఉదయం నుంచీ వేదపండితులు వివిధ పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అమ్మవారి ఊరేగింపు, గ్రామోత్సవం, రాత్రి అగ్నిమథనం, కుంభపూజ తదితర కార్యక్రమాలు జరిపారు. కాగా శనివారం శ్రీమాన్ సుదర్శనం వెంకటజనార్దనాచార్యుల ఆధ్వర్యంలో పండితుల బృందం బొరుసు వెంకటఉదయ భాస్కర్, వసుధ దంపతులతో విగ్రహాలు, ధ్వజస్తంభం ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమాల్లో భక్తులు అత్యధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

చిట్టబ్బాయి అజాతశత్రువు

మామిడికుదురు: మాజీ ఎమ్మెల్యే కుడుపూడి చిట్టబ్బాయి అజాత శత్రువుగా ప్రజల్లో ఎంతో గుర్తింపు పొందారని జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు శ్లాఘించారు. చిట్టబ్బాయి జయంతిని పురస్కరించుకుని మామిడికుదురు బోయి భీమన్న మానవ వనరుల కేంద్రం వద్ద పార్టీ శ్రేణులు ఏర్పాటు చేసిన కేక్‌ను జెడ్పీటీసీ కట్ చేశారు. ప్రజా ప్రతినిధిగా నీతి, నిజాయితీగా పని చేసిన చిట్టబ్బాయి ప్రజల నుంచి మంచి ఆదరణ పొందారన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ కటకంశెట్టి ఆదిత్యకుమార్, సర్పంచ్ గౌస్ మొహిద్దీన్, పార్టీ నేతలు కంచి శ్రీరామ్, నయినాల సత్యమూర్తి, మొల్లేటి సత్యనారాయణ, కుసుమ శ్రీను, పితాని సురేంద్ర పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపు కార్డుల పంపిణీ

రాజోలు: పొదలాడ ఎస్ఆర్ఎల్‌జీ కళాసమితి ఆధ్వర్యంలో కళాకారులకు శుక్రవారం గుర్తింపు కార్డులు పంపిణీ చేశారు. కళాసమితి అధ్యక్షుడు పుల్లెల ప్రసాద్ అధ్యక్షతన సర్పంచ్ కడలి సత్యనారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్డులు అందజేశారు. గుర్తింపు కార్డులు పొందిన కళాకారులకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలు పొందే వీలు కలుగుతుందన్నారు. పీవీఎస్ఎన్ మూర్తి, కోళ్ల సత్యవాణి, కొల్లాబత్తుల సతీష్, కేజేఎం కేశవస్వామి, భాస్కర్ల రాజేశ్వరి, మద్దుల మణి, కాపిశెట్టి సాయిబాబు, తోలేటి నరసింహారావు, చుట్టుగుళ్ల సత్యనారాయణ పాల్గొన్నారు.

కువైట్ ఎన్నారై సేవలు అభినందనీయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఎమ్మెల్యే రాపాక

రాజోలు: ఆపదలో ఉన్న అభాగ్యులకు కువైట్ ఎన్నారై అందిస్తున్న సేవలు అభినందనీయమని రాజోలు ఎమ్మెల్యే రాపాక వరప్రసాదరావు అన్నారు. శుక్రవారం తాటిపాకలో అనారోగ్యంతో మంచానికి పరిమితమైన సరెళ్ల పెద్దిరాజుకు కువైట్ ఎన్నారై సభ్యులు సమకూర్చిన రూ.10 వేల ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే రాపాక అందజేశారు. కువైట్ ఎన్నారై ప్రతినిధి రాపాక ఆదాం ప్రసాద్ సహకారంతో ఆయన స్నేహితులు ఆర్థిక సహకారం అందించారు. మలికిపురం ఎంపీపీ వీరా మల్లిబాబు, నల్లి శివకుమార్, కె.అశోక్, దీపాటి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి మండల పోటీలు

మామిడికుదురు: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీటీ) టోర్నమెంట్ కమ్ సెలక్షన్స్ నిర్వహణపై మామిడికుదురు ఎమ్మార్సీ కేంద్రంలో ఎంఈఓ మోకా వెంకటన్నబాబు అధ్యక్షతన శుక్రవారం సమావేశం జరిగింది. తొమ్మిది విభాగాల్లో ఎస్‌జీటీ పోటీలు జరుగుతాయని ఎంఈఓ వెంకన్నబాబు, మండల స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ మట్టా శ్రీధర్ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, త్రోబాల్, టెన్నికాయిట్, యోగా, అథ్లెటిక్స్‌ను ఈ నెల 12 నుంచి 14వ తేదీ వరకు మూడు రోజుల పాటు మామిడికుదురు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఈ పోటీలు నిర్వహించాలని నిర్ణయించామన్నారు. ఈ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలకు అర్హత సాధిస్తారని తెలిపారు.

ఎల్ఐసీ వ్యవస్థాపక దినోత్సవం

అంబాజీపేట: లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) 67వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను శాటిలైట్ ఆఫీస్ మేనేజర్ కె.లలిత్ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక శాటిలైట్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఎల్ఐసీ సంస్థ రూ.5 కోట్ల పెట్టుబడితో ప్రారంభమై నేడు రూ.45.50 లక్షల కోట్లతో నడుస్తుందన్నారు. సంస్థ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని బీమా వారోత్సవాలను నిర్వహిస్తున్నారు. ఈ నెల 4న మండలంలోని జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వివిధ అంశాలపై వ్యాసరచన పోటీలు, 5న ఎంప్లాయీస్ చిల్డ్రన్స్ కాంపిటీషన్, 6న ఎల్ఐసీ ఏజెంట్లు వారి గురువులకు సన్మానం, 7న మొక్కలు నాటడం, 8న ముగింపు కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కార్యాలయాధికారిణి మాణిక్యాంబ, డెవలప్‌మెంట్ ఆఫీసర్‌లు ఎంఎస్ఎం శర్మ, ఎ.అప్పారావు, కె.రాజు, ఏజెంట్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రాజోలు: రోడ్డు ప్రమాదంలో రాజోలుకు చెందిన బంగారం వెంకటరమణమూర్తి (40) మృతి చెందాడు. పొదలాడలో గురువారం రాత్రి ప్రమాదం జరిగింది. శుక్రవారం రాజోలు ఎస్సై పృథ్వీ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాటిపాకలోని బైక్ షోరూమ్‌లో పని చేసుకుంటున్నాడు. పని ముగించుకుని తాటిపాక నుంచి రాజోలు వస్తుండగా వెనుక వైపు నుంచి ఒక యువకుడు తన బైక్‌తో బలంగా ఢీ కొట్టాడు. దీంతో రమణమూర్తి అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం రాజోలు ప్రభుత్వాస్పత్రిలో వెంకటరమణమూర్తి మృతదేహానికి పోస్టుమార్టమ్ నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.